సాక్షి
తిరుపతి

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



ఘనంగా అఖండ పారాయణం

గీతాజయంతిని పురస్కరించుకుని తిరుమల నాదనీరాజనం వేదికపై భగవద్గీత అఖండ పారాయణం నిర్వహించారు. - 8లో



సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

సౌత్‌జోన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు ఎస్వీయూ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు పీడీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. - 8లో



లారీని ఢీ కొన్న ట్రావెల్ బస్సు

భక్తులతో శబరిమలైకి వెళుతున్న ట్రావెల్ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీ కొని, 15 మంది భక్తులకు గాయాలయ్యాయి. - 8లో



స్వర్ణరథంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి

భక్త వైకుంఠం



శ్రీవారి సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల రద్దీతో తిరుమలలో సందడి నెలకొంది. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు బారులు తీరడంతో పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. భక్తుల గోవిందా నామస్మరణలతో ఏడుకొండలు మార్మోగాయి. శనివారం తెల్లవారుజామున 1.45 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు శ్రీవారిని వైకుంఠ ద్వారం నుంచి దర్శించుకుని పులకించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామివారు స్వర్ణరథంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. – తిరుమల



తిరుమలలో ఏర్పాటు చేసిన వైకుంఠంలో శ్రీరంగనాథుని ప్రతిమలు



మహాద్వారం నుంచి వైకుంఠ దర్శనానికి వెళుతున్న సర్వదర్శన భక్తులు



రంగనాథస్వామి ప్రతిమకు మొక్కుతున్న భక్తులు



శ్రీవారి ఆలయంలో విద్యుత్, పుష్పాలంకరణ

ముక్తిదాయకం.. వైకుంఠ ద్వార దర్శనం

- ముక్కోటి ఏకాదశికి తుమ్మలగుంటలో పోటెత్తిన భక్తులు
- స్వామి సేవలో ప్రముఖులు
- వేకువజామున 4 గంటలకే తరలివచ్చిన భక్తులు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన భక్తుల తాకిడి
- స్వామివారిని దర్శించుకున్న 80 వేల మంది భక్తులు
- భక్తుల సౌకర్యార్థం మెరుగైన ఏర్పాట్లు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



కల్యాణ వెంకన్న దర్శనం కోసం వేచియున్న భక్తులు



ఆలయం ముందు ఏర్పాటు చేసిన గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న

తిరుపతి రూరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం తుమ్మలగుంటకు తరలివచ్చారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు శనివారం వేకువజాము 4 గంటల నుంచే పోటెత్తారు. వేకువజాము 3 గంటలకే సుప్రభాతం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. సాధారణ భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఉదయం నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు క్యూలైన్లు భారీ జన సందోహంతో కిటకిటలాడాయి. దాదాపు 81 వేలకు పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకుని ఉత్తర ద్వార ప్రవేశం చేశారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణలతో మారు మ్రోగాయి. వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న భక్తులు తన్మయత్వం చెందారు. ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన మండపంలో గరుడ వాహనంపై కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి భక్తులను కటాక్షించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భక్తులకు అందుబాటులో ఉంటూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, తిరుపతి రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలతో పాటు మజ్జిగ, ప్రసాదాల పంపిణీ రోజంతా నిర్విరామంగా కొనసాగింది.

కల్యాణ వెంకన్న సేవలో ప్రముఖులు

తుమ్మలగుంట కల్యాణ వెంకనన్నను ప్రముఖులు దర్శించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి, దర్శన ఏర్పాటు చేశారు. స్వామివారి వస్త్రాన్ని బహుకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సీఎం సలహాదారు అవినాష్, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి కుటుంబసభ్యులు విచ్చేశారు. వారిని సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ

విద్యుత్ వెలుగులతో తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం దేదీప్యమానంగా వెలిగింది. వైకుంఠ ఏకాదశిని ఆలయంలో, వెలుపల చేపట్టిన దేశ, విదేశాల నుంచి తెప్పించి రూపొందించిన పుష్పాలంకరణలు భక్తులను కట్టిపడేశాయి. వివిధ రకాల పూలు, పండ్ల అలంకరణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలు, దేవతా మూర్తుల అలంకరణలు కనువిందు చేశాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. విజయవాడకు చెందిన ఉగాది పురస్కార గ్రహీత చదలవాడ ఆనంద్ కళాబృందం 108 అన్నమాచార్య కీర్తనలకు నిర్విరామంగా 14 గంటలు పాటు 40 మంది కళాకారులు నృత్య నీరాజనం పలికారు. చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను కట్టిపడేశాయి. 2024 సంవత్సరం క్యాలండర్లను ఆలయ సిబ్బంది ఉచితంగా పంపిణీ చేశారు. తుమ్మలగుంట గ్రామ యువత, ఆలయ సిబ్బంది భక్తుల సేవలో తరించారు.





కల్యాణ వెంకన్న సేవలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డికి వేదాశీర్వాదం



కల్యాణ వెంకన్న సేవలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

న్యూస్‌రీల్

శేషవాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు



శేష, యాళి వాహనాలపై ఊరేగుతున్న శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ శనివారం శేష, యాళి వాహనాల్లో పురవిహారం చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శేషవాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని యాళివాహనం కొలువుదీర్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని, కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

తిరుపతి అర్బన్: జిల్లాలోని వివిధ బస్టాండ్ల పరిధిలోని ఆర్టీసీ దుకాణాలు అద్దెకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తిరుపతి బస్టాండ్‌తోపాటు నేంద్రగుంట, పుత్తూరు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, కోట, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి బస్టాండ్లలోని 33 దుకాణాలను అద్దెకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా డిపో మేనేజర్ కార్యాలయాల వద్ద దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అదే రోజు 2 గంటల వరకు తిరుపతి డీపీటీఓ కార్యాలయం వద్ద టెండర్లు వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుల నియామకం

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. యువజన విభాగం చంద్రగిరి నియోజకవర్గంలోని చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడిగా వై. శేఖర్, యర్రావారిపాళెం అధ్యక్షుడిగా సి.మనోహర్ రెడ్డి నియమితులయ్యారు. అలాగే గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండల అధ్యక్షుడిగా బండిల హరికృష్ణ, చిట్టమూరు అధ్యక్షుడిగా పుచ్చలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, గూడూరు టౌన్ అధ్యక్షుడిగా జోగి వినోద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సత్యవేడు నియోజకవర్గంలోని బీఎన్‌కండ్రిగ మండల అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, కేవీబీ పురం అధ్యక్షుడిగా ఆర్.యశ్వంత్, నారాయణవనం అధ్యక్షుడిగా ఎన్. ప్రేమ్‌కుమార్, పిచ్చాటూరు అధ్యక్షుడిగా టి.శోభన్‌బాబు, సత్యవేడు అధ్యక్షుడిగా పి. వంశీకృష్ణారెడ్డి, వరదయ్యపాళెం అధ్యక్షుడిగా ఎం. వినోద్‌కుమార్ నియమితులయ్యారు. సూళూరుపేట నియోజకవర్గంలోని దొరవారి సత్రం మండల అధ్యక్షుడిగా సాంబరెడ్డి మనోజ్‌కుమార్, నాయుడుపేట రూరల్ అధ్యక్షుడిగా నాగిరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఓజిలి అధ్యక్షుడిగా బట్టా పృధ్వీకృష్ణ, పెళ్లకూరు అధ్యక్షుడిగా ఓడూరు వినోద్‌కుమార్‌రెడ్డి, నాయుడుపేట టౌన్ అధ్యక్షుడిగా పాలేటి నాగార్జున, సూళ్లూరుపేట అధ్యక్షుడిగా గాలి మల్లికార్జున రెడ్డి, సూళూరుపేట టౌన్ అధ్యక్షుడిగా గాలి వినోద్, తడ అధ్యక్షుడిగా ఎలవూరు తిరుమల రెడ్డి నియమితులయ్యారు. వీరికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

28న మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతిఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆ మేరకు వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సువర్ణలతాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ పీజీసెట్–2023 అర్హత సాధించి, ఇప్పటివరకు అడ్మిషన్లు పొందని వారు మాత్రమే ఈ స్పాట్ అడ్మిషన్లకు అర్హులని, విద్యార్థినులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్పాట్‌అడ్మిషన్లకు హాజరుకావాలన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌పీఎంవీవీ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

తెప్పలపై సుబ్రమణ్యస్వామి విహారం



తెప్పపై విహరిస్తున్న సుబ్రమణ్యస్వామి

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సుబ్రమణ్యస్వామివారు పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విద్యుత్‌దీపాలతో అలంకరించిన తెప్పపై ఆశీనులైన సుబ్రమణ్యస్వామి వారు పుష్కరిణిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

తిరుపతి సిటీ: బెంగళూరులోని జైన్ యూనివర్సిటీ వేదికగా ఈ నెల 25 నుంచి జరగనున్న సౌత్‌జోన్ మహిళా బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు ఎస్వీయూ మహిళా జట్టును శనివారం ఎంపిక చేసినట్లు ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో తిరుపతి ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నుంచి టి అనూష, సి సంజన, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ నుంచి యశస్విని, పద్మావతీ డిగ్రీ కళాశాల నుంచి హర్షిత, స్వాతి, మదనపల్లె జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల నుంచి రుక్మిణి, రఫీయా, కీర్తన, మదనపల్లె విశ్వం డిగ్రీ కళాశాల నుంచి గాయత్రి, కౌసల్య, తిరుపతి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుంచి కావ్య, అఖిల జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎస్వీయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ కే మంజుల చేతుల మీదుగా ఎంపికైన క్రీడాకారులకు స్పోర్ట్ కిట్ అందించి అభినందించారు.

ఘనంగా అఖండ పారాయణం

తిరుమల: గీతాజయంతిని పురస్కరించుకుని తిరుమల నాదనీరాజనం వేదికపై శనివారం భగవద్గీత అఖండ పారాయణం నిర్వహించారు. ప్రముఖ పండితులు కుప్పా విశ్వనాథశర్మ, శేషాచార్యులు, మారుతి ఆధ్వర్యంలో పండితులు భగవద్గీతలోని శ్లోకాలను పారాయణం చేశారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపల్ కేఎస్ఎస్ అవధాని ఇతర పండితులు పాల్గొన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అంతకుముందు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు.

భక్తులకు సంతృప్తికరంగా వైకుంఠ ద్వార దర్శనం

- టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- ఉదయం 5.15 గంటల నుంచే వైకుంఠ ద్వార సర్వదర్శనం ప్రారంభం: ఈఓ ఎవి.ధర్మారెడ్డి



స్వర్ణరథోత్సవంలో టీటీడీ ఛైర్మన్

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులు సంతృప్తికరంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారని, ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేశామని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట శనివారం ఉదయం ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేపట్టామన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. టీటీడీ ఈఓ ఏవీ ధర్మా రెడ్డి మాట్లాడుతూ నిర్దేశిత సమయం కంటే 45 నిమిషాలు ముందుగా శనివారం ఉదయం 5.15 గంటల నుంచే సర్వదర్శనం ప్రారంభించామని తెలిపారు. ఆ తరువాత స్లాట్ల వారీగా ప్రత్యేక ప్రవేశ దర్శనం, సర్వదర్శనం భక్తులను అనుమతించామన్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, టీ, కాఫీ, పాలు అందిస్తున్నామని చెప్పా రు. తిరుపతిలోని కౌంటర్లలో సర్వదర్శనం టోకెన్ల జారీ సజావుగా జరుగుతోందన్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం, సర్వదర్శనం కలిపి రోజుకు దాదాపు 70 వేల మందికి, 10 రోజుల్లో కలిపి దాదాపు 8 లక్షల మందికి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే శుక్ర వారం అర్ధరాత్రి వరకు 40,638 మంది శ్రీవారిని దర్శించుకోగా.. 21,455 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో రూ.3.46 కోట్లు వచ్చాయి.

పోటెత్తిన భక్తులు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామున 1.40 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రముఖులను శ్రీవారిని దర్శించుకునేందుకు టీటీడీ అనుమ తి ఇచ్చింది. అంచనాలకు మించి భక్తులు వస్తుండడంతో టోకెన్లు లేనివారిని క్యూలైన్లలోకి టీటీడీ అధికారులు అనుమతించడం లేదు. భక్తుల రద్దీతో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం ఎదుట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మంత్రి ఆర్కేరోజా





ఆలయం ఎదుట డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు







ఎమ్మెల్సీ భరత్, టీటీడీ మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఎంపీ గురుమూర్తి

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం పలువురు ప్రముఖులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి ప్రసాదాలు అందజేశారు. –తిరుమల

లారీని ఢీ కొన్న ట్రావెల్ బస్సు

- 15 మంది అయ్యప్పభక్తులకు స్వల్పగాయాలు



గాయపడిన డ్రైవర్ ఫణీంద్రబాబు

చిల్లకూరు: ప్రకాశం జిల్లాకు చెందిన కొంత మంది భక్తులు శబరిమలైకి వెళుతున్న క్రమంలో ట్రావెల్ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీ కొన్న సంఘటనలో బస్సు ముందు భాగం నుజునుజ్జు కాగా బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ఫణీంద్రబాబు అనే డ్రైవర్ స్థానికంగా ఉండే విజయ ట్రావెల్స్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 35 మంది అయ్యప్ప భక్తులతో శబరిమలైకి బయలు దేరారు. శనివారం వేకువజామున చిల్లకూరు మండలం జాతీయ రహదారిపై వరగలి క్రాస్ రోడ్డు సమీపంలోని కోల్డ్ స్టోరేజ్ వద్దకు వచ్చే సరికే అదే మార్గంలో చెన్నైకు లోడ్‌తో వెళుతున్న లారీని వెనుకగా బస్సు ఢీ కొంది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా బస్సులో ప్రయాణిస్తున్న 15 మందికి స్వల్ప గాయాలు కాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా స్థానికులు 108 వాహనం ద్వారా గాయపడిన వారిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. డ్రైవర్‌ను మాత్రం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు, ఆర్టీఓ సునీల్, ఏఎస్ఐ నారపరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి అయ్యప్ప భక్తుల నుంచి వివరాలు తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బస్సు ఢీ కొని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పక్కకు జరుపుతున్న పోలీసులు

గూడూరురూరల్: ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్రవాహన చోదకుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శనివారం గూడూరు కోర్టు సెంటర్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన శీను(35) అనే వ్యక్తి గూడూరులో సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. ఈ క్రమంలో కోర్టు సెంటర్ సమీపంలోకి వచ్చేసరికే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొంది. దీంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.